


# పట్నం పోదాం...బోర్ని చూద్దాం...ఛలో! ఛలో!

జి.శ్రీదేవి

టీ.విలో డే అండ్ నైట్ వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ ఇండియా, ఇంగ్లాండ్‌ల మధ్య ప్రత్యక్ష ప్రసారం రిలే అవుతుంది. మొదట టాస్ గెలిచిన ఇండియా బౌలింగ్ తీసుకోవడంతో ఇంగ్లాండ్ భారీ స్కోరుతో బ్యాటింగ్ పూర్తి చేసి ఇండియాకు అగ్నిపరీక్షగా బ్యాటింగ్ అప్పగించి బౌలింగ్‌లో దిగింది. ఇండియా నుండి పిచ్ మీద దిగిన ఓపనర్స్ మొదటి నుండే విజృంభించడం మొదలుపెట్టారు. సిక్సర్స్, ఫోర్‌లతో క్రికెట్ అభిమానులను సంభ్రమాశ్చర్యాలలో ముంచుతూ స్కోరును బంతులు చేజారకుండా ముందుకు తీసుకెళుతున్నారు. అది క్రికెట్ మ్యాచ్‌లా లేదు. ఇంద్రజాలమో, మహేంద్రజాలమోలా ఉంది.

సరిగ్గా అదే సమయంలో ఎఫ్.ఎస్.టి. కలర్ టీ.వి. ముందు ఒంటరిగా కుర్చీలో ఎడమచేతిలో రిమోట్ పెట్టుకుని మ్యాచ్ చూస్తున్న వర్ధన్ అందరికంటే భిన్నంగా ఉన్నాడు. కోట్లాదిమంది కేరింతలు కొడుతూ మ్యాచ్ చూస్తున్న వారిలో వర్ధన్ ఒకడు. అదే అపార్ట్‌మెంట్‌లో సందడి సందడిగా ఉన్నట్లు చప్పట్లు... అరుపులు కూడా వినిపిస్తున్నాయి. కాని వర్ధన్‌లో ఉత్సాహం లేదు. టెన్షన్ లేదు. అయినా మ్యాచ్‌ని నిశితంగా చూస్తున్నాడు. బ్యాట్స్‌మెన్ సిక్సర్ కొట్టే ప్రయత్నంగా బ్యాట్‌ని గాలిలోనికి లేపుతున్నప్పుడు అతని చేతులలోని శక్తిని, నైపుణ్యాన్ని చూస్తున్నాడు... బ్యాట్‌కి టచ్‌యైన బాల్ దొర్లుతున్నప్పుడు లేడి పిల్లలా గాలిలో తేలుతున్నట్లు వారు తీస్తున్న పరుగులను చూస్తున్నాడు... మ్యాచ్ అంతా అవి చేతులా!? అవి కాళ్ళా!? అన్నట్లు సాగుతుంది. అదే అతని మనస్సులో ఉత్సాహాన్ని, నవ్వును ఇవ్వక స్థాణువును చేసింది. అప్పటికే తడి దేరిన కళ్ళు ఎడమచేతిలోని రిమోట్ మీదకు నీటి బొట్లని జారవిడుస్తున్నాయి. సరిగ్గా అదే సమయానికి ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించి ఇండియా వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. వర్ధన్ భారత వ్యతిరేకి కాదు. ఇంగ్లాండ్ పక్షపాతి కాదు. భారతీయుడు. స్వచ్ఛమైన తెలుగువాడు. ప్రస్తుతం రాజధాని నివాసి. క్రికెట్ అంటే ఉత్సాహమే కాదు ఊపిరిగా పెరిగినవాడు. ఏదో ఒక రోజున భారత్ క్రికెట్ టీమ్‌లో తాను సెలక్ట్ కావాలని కృషి పట్టుదలతో ఎన్నో మ్యాచ్‌లు ఆడినవాడు.

"వర్ధన్...." అంటూ కిచెన్‌లోనుంచి తల్లి ప్రభావతి పిలుపు వినిపించింది. ఆమె గొంతు వినిపించటమే రిమోట్ వడిలో వదలి చక చక కళ్ళు తుడుచుకుంటూ ఆమె వస్తుందేమోనని కంగారుగా కిచెన్ వైపు చూశాడు.

"చూసినంతవరకు చాలు, టైమ్ పదయ్యింది. భోజనం చేయి నాన్నా! నువ్వు భోజనం చేస్తే ఆ తరువాత పని కూడా చాలా ఉంది. తెమ్మంటావా? చూస్తూనే తిందువు కాని పోనీ. కలుపుకొస్తున్నా."

"ఊ.." అంటూ చిన్నగా బదులిచ్చాడు తల్లి చెవినపడేటట్లు ఏ ఒక్కరికీ తన సమాధానం నిద్రాభంగం కలుగజేయకూడదనే ఉద్దేశ్యంతో. అలా అంటున్నప్పుడు అతనెంతటి సున్నిత మనస్కుడో కూడా స్పష్టమయ్యింది. అతను కూర్చున్న హాల్‌కు వెనుకవైపు ఉన్న బెడ్‌రూమ్‌లో తండ్రి చలపతిరావు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అదే హాల్‌లో సోఫాలో నాయనమ్మ ఎల్లమ్మ మ్యాచ్ చూస్తున్న మనవడిని చూస్తూనే ఏవో ఆలోచనలతో అప్పటికే నిద్రలోకి జారుకుంది. ఇరవై ఐదు సంవత్సరములు వయస్సు గల వర్ధన్ కుర్చీలోనుండి లేవకుండానే తల్లి ప్రభావతి అన్నం కలిపిన పళ్ళెంతో వచ్చి అతనిని ఏమాత్రం డిస్టబ్ చేయకుండా ప్రక్కగా నిలబడి గోరుముద్దలు తినిపిస్తుంది. తల్లి పెడుతున్న ముద్దలు తింటూనే టీ.వి.లో ఇండియాకు కప్ అందించేందుకు జరుగుతున్న నిర్వాహకుల సన్నాహాలను తిలకిస్తున్నాడు. నిజానికి అతని చూపులు టీ.వి. వైపు ఉన్నాయి కాని మనస్సు మాత్రం అక్కడ లేదు. వద్దన్నా వినిపించుకోకుండా కలుపుకొచ్చిన అన్నం మొత్తం బ్రతిమాలి తినిపించి మంచినీళ్ళు త్రాగించి పమిటచెంగుతో వర్ధన్ మూతి తుడిచి తృప్తిగా కిచెన్‌లోనికి వెళ్ళిపోయింది తల్లి ప్రభావతి.

ఇరవై ఐదు సంవత్సరాల వయస్సు వచ్చిన కొడుకుకు స్వయంగా అన్నం కలిపి ముద్దలు చేసి తినిపించడం అదృష్టమా? దురదృష్టమా? అదే తెలియపరుస్తుంది రిమోట్‌తో టీ.వి. ఆపి ప్రక్కనే ఉన్న టీపాయ్ మీద రిమోట్ ఉంచిన ఎడమచేయి వర్ధన్‌ను బెడ్‌రూమ్‌లోనికి అరికాలు కూడా క్రింద పెట్టనీకుండా తీసుకెళుతున్న వీల్ ఛైర్ దృశ్యం...

యాభై సంవత్సరాలకు పూర్వం చలపతిరావు ఆంధ్రరాష్ట్రంలో ఓ మారుమూలకు విసిరేసినట్లున్న ఓ కుగ్రామంలో ప్రకాశరావు, ఎల్లమ్మలకు ఏకైక సంతానంగా జన్మించాడు.

"అమ్మా... నేను చదువుకుంటానే! నాన్నా... నేను బడికెళతాను" అనడం మొదలుపెట్టాడు ఐదు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి. చలపతిరావు మాటలు తల్లిదండ్రులకు మింగుడు పడలేదు. బడికెళతానంటున్న కొడుకుని చూసి ఆనందించాలో, విచారించాలో అర్థం కాలేదు. అప్పటి వరకు ఉన్న నాలుగు ఎకరాల కొండ్రను వాడితోపాటు పెంచి పెద్దచేసి ఇస్తే వాడి బ్రతుకేదో



వాడు హాయిగా బ్రతుకుతాడనే ఉద్దేశ్యంతోనే ఉన్నారు. నిజానికి ఆ ఊరులో మనిషి జీవితానికి వెలుగునిచ్చే బడి లేదు. చీకటిలో దారి చూపించే కరెంటు లేదు. ఊరు దాటి బయటకు పోవడానికి సరైన దారి లేదు. ఆ ఊరిలో చదువుకున్నవారు ఏ ఒక్కరూ లేరు. చదువుకుని బయటనుండి వచ్చినవారు కూడా లేరు. ఆ ఊరిలోనివారు అంతకంటే అధ్వాన్నంగా ఉండే దిగువ ప్రాంతాలవారితో వియ్యమొందటమో, అదే ఊరిలో వారితో అందుకోవటంతోనో కాలం గడిచిపోతుంది. ఓటర్ల లిస్ట్‌లో పేర్లకు మినహా ఆ ఊరికి ఎందులోనూ గుర్తింపు లేదు. చలపతిరావులో ఆ ఆలోచన ఎలా వచ్చిందని ఆలోచించలేదు. ఎల్లమ్మ పదిమంది అన్నదమ్ముల మధ్య ఒక్కగానొక్క ఆడపడచు. ఎల్లమ్మకంటే పెద్దవాడైన గోపయ్య మాత్రం ఉన్న పొలంలో కొంత అమ్ముకుని పట్నం పోయి చాలాకాలం క్రితం స్థిరపడ్డాడు. మిగిలినవారంతా ఆ గ్రామంలోనే పొలం పనులు చూసుకోవడంతో కాలం గడిపేస్తున్నారు. పట్నంలో స్థిరపడిన గోపయ్య అప్పుడప్పుడు తన పిల్లలతో వచ్చిపోవడం వల్ల చలపతిరావులో పట్నంలో చదువుకోవాలనే ఆసక్తి చిరుప్రాయంలోనే ఏర్పడింది. చదువుకుంటే ఏదో ఉన్నతంగా జీవితం ఉంటుందని వాడి అభిప్రాయం. చలపతిరావు ఆశను తుంచలేని దంపతులిద్దరూ ఓ నిర్ణయానికొచ్చి ఎల్లమ్మ పట్నంలో స్థిరపడిన అన్న గోపయ్యతో సంప్రదించి చదువు బాధ్యతను ఆయనకు అప్పగించి ఆయనతో చలపతిరావును పట్నం పంపారు. దారి డొంక సరిగాలేని ఊరిలో నుండి బయటపడిన చలపతిరావు జీవితానికి ఓ దారి ఏర్పడింది. రోజులు గడవడంతో చదవాలనుకున్న కోర్సు చదివి చిట్ట చివరకు బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకుని అదే బ్యాంకులో జాబ్ చేస్తున్న ప్రభావతిని తల్లిదండ్రుల అంగీకారంతో పెండ్లి చేసుకున్నాడు. చలపతిరావు చిన్నప్పుడు నాలుగు ఎకరాలుగా ఉన్న భూమిని ప్రకాశరావు రెట్టింపు చేసి కాలం చేశాడు.

తండ్రి మరణంతో తల్లిని పట్నం తీసుకెళ్ళాలని కొడుకు, కోడలు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. వారి ప్రేమాభిమానాలకు సంతోషించిన ఎల్లమ్మ సున్నితంగానే తిరస్కరించింది.

రెండు సంవత్సరాలు గడిచింది. అప్పుడప్పుడు చలపతిరావు రావడం, భార్యాభర్తలిద్దరూ కలిసిరావడమో జరుగుతుంది. ప్రభావతి గర్భవతి అనే కబురు ఓ రోజున లెటరు ద్వారా వచ్చింది. ఆ వార్త ఊరంతా చెప్పి ఎల్లమ్మ తెగ సంబరపడిపోయింది. లెటరు తెచ్చిన పోస్ట్‌మాన్‌తోనే తిరిగి ఎన్నో జాగ్రత్తలతో తరచూ లెటర్లు వ్రాయడం చేసింది. ఒక శుభవేళ ప్రభావతి మగబిడ్డను ప్రసవించిందనే కబురుతోపాటు ఆమెను స్వయంగా తీసుకురమ్మని చలపతిరావు ఏదో పనిమీద వస్తున్న మేనమామ గోపయ్యకు పురమాయించాడు. ఆ వార్త చెవిన పడిన ఎల్లమ్మ



## టీ.వి. సీరియల్‌కు తొలిసారిగా పరిచయమవుతున్న శ్రావణి

ఆమె కూచిపూడి నాట్యం చేసినా, భరతనాట్యం చేసినా, ఫోక్ డాన్స్ చేసినా ప్రేక్షకుల మిన్నుముట్టే కరతాళ ధ్వనులను అందుకోవలసిందే. ఓ చిరునవ్వు వెన్నెల్లా మెరిసే పలువరుస, చలాకీగా, కలుపుగోలుతనంగా ఎటువంటి బేషజం లేకుండా అందరితో కలిసిపోతూ వుండే శ్రావణి అనేక నాట్యప్రదర్శనలు ఇచ్చి అందరి మెప్పు పొందింది. ఫస్ట్ ఇంటర్ చదువుతూ, చదువులో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా, చదువు తర్వాత నాట్యమే ప్రాణంగా విమర్శకులను సైతం మెప్పించి, నాట్యపోటీలలో అనేక బహుమతులను పొందింది శ్రావణి. జెమినీలో డాన్స్ బేబి డాన్స్, ఈటీవిలో 2001లో నాట్యపోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకుంది. హైద్రాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు తదితర పట్టణాలలో నాట్య ప్రదర్శనలిచ్చింది. శ్రావణి నాట్య ప్రదర్శనను చూసిన టీ.వి. సీరియల్ డైరెక్టర్ అచ్చన శ్రీనివాసయాదవ్ మొదటిసారిగా ఆమెను 'పిల్లలు కాదు పిడుగులు' సీరియల్ ద్వారా చిన్న తెరకు పరిచయం చేస్తున్నారు.

- ఎన్.ఆర్.ఆర్

ఎట్టకేలకు ఊరి పొలిమేర దాటి ఎక్కే బస్సు దిగేబస్సుతో రోజు ప్రయాణంతో అన్నతో పట్నం చేరింది.

మొట్టమొదటిసారిగా వస్తున్న తల్లిని చూసిన చలపతిరావు ప్రభావతిలలో అవధులు లేని సంబరం చేరి పసివాడితో ఎదురొచ్చి గుమ్మం బయటే అందివ్వబోయారు గుమ్మడిపండులా, బొద్దుగా పచ్చని ఛాయలో ఉన్న పసివాడిని.

"ఉండండ్రా, కాళ్ళు కడుక్కోవడానికి కొద్దిగా నీళ్ళివ్వండి. దిగ్గు దేశాలు తిరిగొచ్చాను. ఎలాపడితే అలా పసికందును చేతికిచ్చేయటమేనా?" అంటూనే ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ప్రభావతి చేతిలోని పసివాడిని చూస్తుంది. అంతలోనే చలపతిరావు చకచక బకెట్‌తో నీళ్ళు తెచ్చి స్వయంగా తన చేతులతో తల్లి కాళ్ళు కడిగి ఆప్యాయంగా లోనికి ఆహ్వానించాడు. ప్రభావతి అందించిన పసివాడిని ముద్దులతో ముంచుతూనే లోనికి అడుగెడుతూ - "పేరేం పెట్టారు" అని అడిగింది.

"ప్రకాష్‌వర్థన్...." ఇద్దరూ కోరస్‌గా చెప్పారు. ఎల్లమ్మ చెవిన ఆ మాట పడటమే కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ముద్దాడుతున్న పెదాలు కాస్తంత వెనక్కు తగ్గాయి. తన భర్త పేరు తిరిగి తన ముందుకొస్తుందని ఆమె ఏనాడూ ఊహించలేదు.

"అయితే ఆ పల్లెలో పెద్దాయన తిరిగి ఈ పట్నంలో పుట్టి ఏనాడూ ఊరు దాటి ఎరుగని ఈ ఎల్లమ్మని ఒక్క క్షణం కూడా ఆ పల్లెలో నిలువనివ్వకుండా పట్నం తీసుకొచ్చాడన్నమాట" గర్వంగా తనలో తనే గట్టిగా అనుకుంది.

వారం పది రోజుల్లో తిరిగి వెళ్ళిపోదామని వచ్చిన ఎల్లమ్మ మనవడి సందట్లో నాలుగు నెలలు గడిపేసింది.

"ఒరేయ్, చలపతి ఇక నేను గ్రామం పోతానురా. పొలం, గొడ్డు గోద అన్నీ ఉన్నఫలాన వదిలి ఈ పెద్దాయన్ని చూడాలని వచ్చాను. ఎంతైనా మనం ఉన్నదారి వేరుగా. నేను రేపే వెళ్ళిపోదామనుకుంటాను."

వర్థన్ మమకారంతో ఆమె ఇక్కడ శాశ్వతంగా ఉండిపోతుందని అనుకుంటున్న చలపతిరావుకి షడన్‌గా వచ్చిన ఆమె నిర్ణయం నోట మాట రానీయలేదు.

"ఏంట్రా మాట్లాడవూ?"

"అది కాదే, ఇప్పుడంత తొందరేమి వచ్చింది. అదేదో కవులుకిస్తే పోలా...."

"బాగుంది, ఎంతో కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించింది పరుల చేతులలో పెట్టడానికా? నేనున్నంత వరకు నన్ను చూసుకోనివ్వండి. ఆ తరువాత అంతా మీ ఇష్టం" ప్రక్కనే ఉన్న ప్రభావతిని కూడా ఉద్దేశించి అంది.

"ఇక్కడ బాబును వదిలి అక్కడ ఉండగలవా?" అన్నాడు తల్లి వడిలోనే ఆడుకుంటూ కేరింతలు కొడుతున్న వర్థన్‌ని చూస్తూ.

"ఉండలేను, అలా అని ఇక్కడే ఉండనూలేను. ఇక్కడకు అక్కడి పొలం, గొడ్డు గోద రప్పించుకోవడం కష్టం కాని, అక్కడకూ..." అంటూ పొరపాటున ఏదో మాట ద్రొల్లుతున్నట్లు టక్కున ఆపి ప్రక్కనే ఉన్న కోడలు వైపు చూసింది.

"అవునండీ, అది నిజమే! వర్థన్ మనదగ్గరుంటే ఒకటి అత్తయ్యగారి దగ్గరుంటే ఒకటీనా? వాడికి మనమెంతో అత్తయ్యగారు అంతే! ఇంకా చెప్పాలంటే మనకంటే ఆమే ఎక్కువ" ప్రభావతి అత్తగారి అభిప్రాయాన్ని గ్రహించి బలపరచింది. ఆమె మాటలలో కొంత స్వార్థముంది. వర్థన్‌ని దగ్గర ఉంచుకుంటే ఉద్యోగం చేయడం కుదరదు. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడే ఆ ప్రస్తావన వచ్చింది.

"చైల్డ్‌కేర్ సెంటర్‌లో చేర్పిద్దామా?" ఒకానొక సమయంలో ప్రభావతిని అడిగాడు చలపతిరావు.

"ఊహూ మన దగ్గర పెరిగిన ఇది అక్కడెలా వస్తుంది" అంది అయిష్టంగా అనాథగా అయినవారి దగ్గర పెరిగిన ప్రభావతి. "అయితే ఉద్యోగం మానేస్తావా?" అని అడిగాడు చలపతిరావు.

"ఇప్పుడెందుకు అదంతా. అప్పుడాలోచిద్దాంలే" ఆ విషయం అక్కడితో కట్ చేసింది. నిజానికి ఆమె అంతరంగంలో ఆమెకు తెలియకుండానే పుట్టబోయే వారిని సాకేందుకు అత్తగారున్నారు అనే భావం ఏదో ఒక మూల దాగుంది.

చలపతిరావు, ప్రభావతి అంగీకారంతో గ్రామంలో ప్రకాష్‌వర్థన్‌తో ఎల్లమ్మ అడుగుపెట్టింది. నాలుగు నెలల ప్రకాష్‌వర్థన్ నాలుగు సంవత్సరాలు గిర్రున తిరిగేసరికి ఎల్లమ్మకు పెద్దాయనగా గ్రామవాసులకు ప్రకాశరావుగా సుపరిచితుడైపోయాడు. అప్పుడప్పుడు వచ్చి చూసిపోతున్న తల్లిదండ్రులలో ఎల్లమ్మ పెంపకం ఆశాజనకంగా ఉండటంతో నిదానంగా రావడంలో కూడా గ్యాప్ ఏర్పడింది. నాలుగు సంవత్సరాలు గిర్రున తిరిగిన తరువాత వర్థన్‌ను స్కూలులో జాయిన్ చేయాలి, పంపే ప్రయత్నంలో ఉండమని కొడుకు, కోడలు దగ్గరనుండి లెటరు బాంబులా పేలింది.

"పెద్దాయనా... పెద్దాయనా..." అని ముద్దు ముద్దుగా పిలుచుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకుంటున్న వర్థన్ దూరమవుతాడు అనే బాధ, భయం, లెటరు రావడంతో ఎల్లమ్మ కంటినిండా కునుకు లేకుండా చేశాయి. ఏంచేయాలో పాలుపోక విషయం చెప్పి కనిపించిన ప్రతి ఒక్కరి సలహా అడిగి చూసింది. వర్థన్ తనకు దూరం కాకూడదు. తను పల్లె వదలకూడదు. ఎలా?

ఎవరికి తోచిన సలహా వారిచ్చారు. చివరకు చలపతిరావును చదివించిన అన్న గోపయ్య సలహా తీసుకునేందుకు పూర్తి వివరాలతో వెంటనే బయలుదేరి రమ్మని ఉత్తరం వ్రాయించింది. ఆమె

కబురు అందటమే గోపయ్య గ్రామం చేరాడు. ఎల్లమ్మ - వర్ధన్‌ల అనుబంధం కళ్ళారా చూశాడు.

"ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నావే?" అని భోజనం కానిచ్చిన తరువాత అడిగాడు ఇద్దరినీ గమనించిన గోపయ్య.

"అది దిక్కుతోచకేగా నీకు కబురు పంపించి. ఆనాడు వాడిష్టప్రకారమే నీ దగ్గరకు పంపాను. ఈనాడు వాడిష్టప్రకారం ఈ పెద్దాయనను పంపడం నావల్లకాదు" వడిలోని వర్ధన్‌ను గుండెలకు హత్తుకుని కళ్ళనిండా నీళ్ళు నింపుకుని చెప్పింది. ఆక్షణం ఆమె ఊపిరే ఆ పసివాడు అని గోపయ్య గుర్తించాడు.

"మరి వాడి భవిష్యత్తు!" "చదువుకుంటేనా బ్రతుకా? లేకపోతే లేదా? చదువు లేకుండా ఎందరు బ్రతకడం లేదు".

"అది నిజమే! కాని రేపు నీ వడిలోని ఈ పసివాడే పెరిగి పెద్దవాడై చదువు సంధ్యలు నాగరికంగా ఉన్న తల్లి, దండ్రులను చూసి నన్ను అలా ఎందుకు పెంచలేదు అని నిలదీస్తే...?"

"అదీ నిజమే అనుకో..." కాస్తంత సందిగ్ధంలో పడింది, ఏం పాలుపోనట్లై.

"అయితే నేను సలహా చెబుతాను. కాదూ, కూడదు అనకూడదు". "అందుకేగా నిన్ను రప్పించింది."

"నువ్వు వీడిని వాళ్ళ అమ్మా నాన్న దగ్గరకు పంపి ఉండలేవు. ఒకవేళ పంపినా నీవు వెళ్ళి వాళ్లతోపాటు ఈ ఊరు వదిలి శాశ్వతంగా ఉండనూలేవు. ఉండేదానివే అయితే ఆనాడు బావ పోయిన రోజున వాళ్ళు అంతగా బ్రతిమాలిన రోజునే వెళ్ళేదానివి. వీడికి అక్కడ వదిలినా ఎప్పుడైనా చూసిరావాలంటే కనీసం రోజు ప్రయాణం పడుతుంది. ఇక్కడుంచుకుంటే వాళ్ళ పరిస్థితైనా అంతే! ఐనా వారికి ఇప్పుడు కావాలిసింది వీడి భవిష్యత్తు. నీవు పంపనని మొరాయించినా వారు తీసుకుపోవడం ఖాయం. దీనికొకటే మార్గం ఉంది. ఆ రోజుల్లో చదువుకోవాలంటే దేశం కాని దేశం వెళ్ళాల్సొచ్చేది. కాని ఇప్పుడు చదువులు ప్రశాంత వాతావరణంలో ఉండే పల్లెల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. ఇక్కడకు పది, పన్నెండు క్రోసుల దూరంలో ఒక చక్కటి రెసిడెన్షియల్ స్కూలుంది. రెసిడెన్షియల్ స్కూలంటే పూర్తి బాధ్యత ఇక వారిదే అన్నమాట. అందులో జాయిన్ చేస్తే వారం వారం వెళ్లి నువ్వు తనివితీరా చూసుకుని రావచ్చు. వీడికి మంచి చదువు అబ్బుద్ది. అదీ ఆదివారమే వెళ్ళాలి సుమా! అందులో జాయిన్ చేసి వారానికోసారి చూడాలనుకుంటావో, వాళ్ళ అమ్మా, నాన్న దగ్గరకు పంపి ఏ ఏడాదికో, రెండేళ్లకో చూడాలనుకుంటావో తేల్చుకో. అది కూడా తొందరలో జరిగిపోవాలి. ఇంకా రెండు, మూడు రోజులలో స్కూల్స్ తెరుస్తారు. ఈ లోపు నువ్వు తీసుకుపోయి అప్పగించకపోయినా వారు ఏదో ఒక రోజున ఖాళీ చూసుకుని వచ్చి తీసుకుపోవడం మాత్రం ఖాయం. ఈలోపే అదేదో చేసేస్తే వారు సర్దుకుపోతారు. నేను కూడా వాడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తాను. అదీ సంగతి. ఆలోచించుకో."


గోపయ్య చెప్పినది కొంతవరకు బాగుండటంతో రెసిడెన్షియల్‌లో ఆయన ద్వారానే జాయిన్ చేసే ఏర్పాటు చేసింది. ఆ విషయం తెలిసిన కొడుకు, కోడలు పైకి కస్సుబుస్సు మన్నా తామైనా చేసేది అదే కావడంతో అడ్జెస్ట్ అయిపోయారు. జాయిన్ చేసే రోజున సెవెన్త్ క్లాస్ వరకు ఉన్న రెసిడెన్షియల్‌లో వర్ధన్ దిన దిన ప్రవర్థమానంగా పెరిగి పెద్దవాడవుతుంటే అతనితో పాటే రెసిడెన్షియల్ కూడా ఇంటర్‌స్థాయికి చేరి ప్రకాష్‌వర్ధన్‌ని ఇంటర్మీడియట్ స్కూల్ ఫస్ట్‌లో ఉత్తీర్ణుడిని చేయించి పెద్దాయనగా నాయనమ్మ దగ్గరకు పంపింది.

"ఎల్లా... ఓ ఎల్లమ్మా... ఏం చేస్తున్నావూ? గుమ్మంలో నుండి మనిషి గొంతు చించుకుని పిలుస్తుంటే వినిపించటము లేదా?" గొంతులో ఏదో మాధుర్యం నిండిన పిలుపు వినిపించి నడుము ఒంగిన ఎల్లమ్మ నిదానంగా బయటకు వచ్చి చేతిలో లగేజీతో మరో చేతిలో క్రికెట్ బ్యాట్‌తో ఎదురుగా నిలబడి చిరునవ్వుతో చూస్తున్న వర్ధన్‌ని చూసి నివ్వెరపోయింది.

"పెద్దాయనా.....!?" అంది తనను తాను నమ్మలేనట్లు భర్త గొంతును ఇమిటేట్ చేసిన వర్ధన్‌ని చూసి ఔనా? కాదా? అన్నట్లు. "ఊ... నేనే" అన్నట్లు తలాడిస్తూ చేతిలోని లగేజీ క్రికెట్ బ్యాట్‌తో సహా జారవిడిచి రెండడుగులు ముందుకు వేసి నాయనమ్మను ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. వారం వారం రెసిడెన్షియల్‌లో జాయిన్ చేసిన దగ్గరనుండి వెళ్ళే ఎల్లమ్మ వయస్సు మీద పడటంతో ఆ తరువాత అప్పుడప్పుడు వర్ధన్ వచ్చి చూసి పోవడం జరుగుతుంది. ఎగ్జామ్స్ కావడంతో ఈమధ్య చాలాకాలం నుంచి రాలేదు. ఎగ్జామ్స్ అయిన తరువాత కాలేజీలో లాంగ్‌టూర్ వేయడంతో అటు నుండి అటే వెళ్ళిపోయాడు. అంత గ్యాప్ తరువాత నూనూగు మీసాలతో చేయ్యెత్తు మనిషైన వర్ధన్‌ని చూసి ఎవరైనా చూస్తే దిష్టి తగులుతుందేమోనని గబగబా-1 లోనికి తీసుకువెళ్ళింది. ఆ మర్నాటినుండి ఎప్పటిలా ఇంటి ఎదురుగా ఇసుక రోడ్డుమీద నలుగురిని ప్రోగుచేసుకుని క్రికెట్ ఆడటం పొలం పోయి చెట్టు పుట్టల వెంట తిరగడంతో అంత కాలం జైలు వాతావరణం లాంటి రెసిడెన్షియల్‌లోని జీవితానికి భిన్నంగా స్వేచ్ఛగా ఉన్నాడు. గ్రామంలో అడుగుపెట్టి నాలుగురోజులు గడచిందో లేదో వర్ధన్ స్కూల్ ఫస్ట్‌లో పాసయ్యాడని తెలుసుకున్న తల్లిదండ్రులనుండి విషెస్‌తోపాటు గోల్డ్‌చైన్ వాచీ గిఫ్ట్‌గా వచ్చింది. అక్కడితో సరిపెట్టలేదు. ఎంసెట్ కోచింగ్ తీసుకునేందుకు వెంటనే బయలుదేరి రమ్మని కూడా లెటరు వ్రాశారు. సరదాగా నాలుగు రోజులు కాలం గడిపిన వర్ధన్ తనకు ఎంసెట్ గట్రా చదవటం ఇష్టం లేదని తిరిగి లెటరు వ్రాసి పోస్ట్ చేసి అదే విషయం నాయనమ్మ ఎల్లమ్మకు చెప్పాడు.

వర్ధన్ నిర్ణయం ఎందువల్లో ఆమెలో సంతోషం కల్గించలేదు. ఏదో అలజడిని సృష్టించింది. ఆక్షణం విని మౌనంగా ఊరుకుంది. ఆతరువాత ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. గోపయ్య చెప్పినట్లు వర్ధన్‌కి మంచి భవిష్యత్ కావాలి. అది అతనికి ఉంది. కాని పల్లెలో కాదు. పట్నంలో తల్లిదండ్రులకు చేరువైతే. ఇక్కడే ఉంటే...?

**(ముగింపు పైవారం)**



## అరుదైన అలవాటు!

నట సార్వభౌమ యన్టీ రామారావుకి ఓవింత అలవాటుంది. షూటింగ్ సమయంలో ఏ ఒక్కనిమిషం తీరిక దొరికినా కునికిపాట్లు పడేవారు. అన్నగారు ఏవయినా ఆలోచిస్తున్నారా? అని అడిగితే అబ్బే యోగనిద్రలో వున్నానండీ అనేవారు. మరో విశేషమేమిటంటే అరక్షణం నిద్రపోయినా అన్నగారి ముఖం నవనవలాడుతూ ఫ్రెష్‌గా వుండేది. కేవలం 'టచప్' చేసుకుంటేచాలు. ఈ అరుదైన అలవాటు ఒక్క యన్టీఆర్‌లోనే వుండేది.